సాక్షి
వరంగల్
శనివారం | 24 | ఆగస్టు | 2024



'ఓపెన్'గా చదివేద్దాం - 8లో▸

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఈ విద్యాసంవత్సరానికి గాను డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందవచ్చని వర్సిటీ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.



ప్రజల దృష్టి మరల్చేందుకే..

ప్రజా సమస్యల నుంచి దృష్టిని మరల్చేందుకే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపులపై పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని డాక్టర్ కె. నారాయణ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/24^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ప్రత్యేక ప్రజావాణి

వరంగల్: కలెక్టర్ సత్య శారద ఆదేశానుసారం జిల్లాలోని దివ్యాంగులు, వయోవృద్ధులకు శనివారం ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

డీఏఓ అనురాధ బాధ్యతల స్వీకరణ



వరంగల్: జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏఓ)గా కె.అనురాధ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న ఆమె ఇటీవల జరిగిన బదిలీల్లో వరంగల్ జిల్లాకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఉషాదయాళ్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. డీఏఓను అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్య శారదను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన మార్కెటింగ్‌శాఖ సెంట్రల్ కమిటీ

వరంగల్: కలెక్టర్ సత్య శారదను రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సెంటల్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింహారెడ్డి, ముక్రం శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అంతకుముందు వరంగల్ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మార్కెటింగ్ శాఖ ఉద్యోగులు రైతులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, మార్కెట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విష్ణుప్రియ



పర్వతగిరి: రాష్ట్రస్థాయి యోగా పోటీలకు మండలంలోని సోషల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థిని కె.విష్ణుప్రియ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. ఈ మేరకు వరంగల్ హంటర్ రోడ్డులోని యోగా సెంటర్‌లో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విష్ణుప్రియను ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తనిఖీలు

గీసుకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, జెడ్పీ ఉన్నత పాఠశాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల అధికారి బి.సంధ్యారాణి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. బియ్యం, వంట సామగ్రి, భోజనాన్ని పరిశీలించి సంతృప్తి చెందారు. హెచ్‌ఎంలు ఎస్.రవీందర్, ఎం.పట్టాభి, అంగన్‌వాడీ టీచర్ వీరగోని నిర్మల పాల్గొన్నారు.

'మహిళా శక్తి'ని సద్వినియోగం చేసుకోవాలి



వర్ధన్నపేట: మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ మునిగాల దయాకర్ అన్నారు. ఇల్లంద గ్రామ కావేరి గ్రామైక్య సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మహిళా శక్తి మొబైల్ క్యాంటీన్ ఏర్పాటు సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. మహిళా శక్తి మొబైల్ క్యాంటీన్‌కు పెట్టుబడి అందిస్తామని హామీ ఇచ్చారు. హెచ్‌ఆర్ ఏపీఎం ధర్మేందర్, సీసీ గోలి కొమురయ్య, వీఓ ప్రతినిధులు స్వప్న, మాధవి, వీఓఏలు రమ్య, శోభ, కత్తి స్రవంతి, రమ, శ్రీమణికంఠ స్వయం సహాయక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాద ఘంటికలు!

- నర్సంపేటలో శిథిలావస్థకు చేరిన ఐబీ కార్యాలయం
- పెంకుటిల్లులో భయంభయంగా విధులు నిర్వరిస్తున్న సిబ్బంది
- వర్షాకాలంలో గదుల్లోకి నీరు.. తడుస్తున్న ఫైళ్లు
- కొత్త భవనాలకు ప్రతిపాదనలు.. మంజూరుకాని నిధులు



శిథిలావస్థకు చేరిన ఐబీ కార్యాలయంపై కప్పిన టార్పాలిన్

నర్సంపేట రూరల్: నర్సంపేట పట్టణంలో నిజాం కాలం నుంచి ఐబీ (ఇరిగేషన్ బ్రాంచ్) కార్యాలయం కొనసాగుతోంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ కార్యాలయం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. కూలడానికి సిద్ధంగా ఉన్న ఈ పెంకుటిల్లులో భయంభయంగా అధికారులు, సిబ్బంది కాలం వెల్లదీస్తున్నారు. ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కొత్త భవనం నిర్మించాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినా ఫలితం లేదు. అదేవిధంగా మాదన్నపేట రోడ్డులో ఉన్న ఎస్ఈ, ఈఈ, డీఈ కార్యాలయాలు కూడా అద్దె భవనంలో కొనసాగుతున్నాయి.

నర్సంపేట పట్టణంలోని జిల్లా ఆస్పత్రి ఎదుట సుమారు 15 గుంటల్లో ఐబీ కార్యాలయం ఉంది. నిజాం కాలంలో ఈ పెంకుటిల్లు (కార్యాలయం) నిర్మించారు. క్రమంగా పెంకలు పగిలిపోయి, గోడలు కూలిపోయాయి. దీంతో కొన్ని గదులను అధికారులు, సిబ్బంది వదిలేశారు. ఉన్న గదులనే తాత్కాలికంగా మరమ్మతులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఆ పెంకలపై టార్పాలిన్ కప్పాల్సిందే. లేదంటే వర్షం పడితే మొత్తం గదుల్లోకి నీరు చేరి ఫైళ్లు తడుస్తాయి. దీంతో వాసాలు పాడై కింద పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. వీటికి తోడు కోతుల పెంకలను మొత్తం చెల్లాచెదురు చేస్తున్నాయి. ఇందులో నర్సంపేట, చెన్నారావుపేట సబ్ డివిజన్ కార్యాలయం, ఖానాపురం సబ్ డివిజన్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఒక్కో కార్యాలయంలో ఒక డీఈ, నలుగురు ఏఈలు, ఇతర సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఎక్కువగా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాల్సి వస్తుంది. ఉన్న కాసేపైనా కార్యాలయాల్లో ఉండాలంటేనే వారు జంకుతున్నారు. రైతులు కూడా ఈ కార్యాలయానికి రావాలంటేనే భయపడుతున్నారు.



పగిలిన పెంకలు



పగిలిన ఐబీ కార్యాలయ గోడ

స్థలం ఉన్నా.. భవనాలు కరువు..

నర్సంపేట పట్టణంలోని హనుమాన్ దేవాల్ పాఠశాల ఎదుట ఐబీ కార్యాలయానికి సంబంధించి సుమారు ఐదు గుంటల ఖాళీ స్థలం ఉంది. కానీ, ఇక్కడ భవనాలు లేవు. నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రి ఎదుట శిథిలావస్థకు చేరిన ఐబీ కార్యాలయాలను కూల్చి, ఇక్కడ కొత్త భవనాన్ని నిర్మించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించినా నిధులు మంజూరు చేసిన దాఖలాలు లేవు. అదేవిధంగా పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో ఐబీ ఎస్ఈ, ఈఈ, డీఈ కార్యాలయాలకు సొంత భవనాలు లేకుండాపోయాయి. అద్దె భవనాల్లో ఇవి కొనసాగుతున్నాయి. డీఈ కార్యాలయం మాత్రం శిథిలావస్థకు చేరింది. గతంలో డీఈ కార్యాలయానికి దాత దొడ్డ మోహన్‌రావు అంబేడ్కర్ సెంటర్‌లో ఉన్న తన ఇంటిని ఇస్తానని అప్పటి కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ ఆధ్వర్యంలో తాళం సైతం అందించారు. ఏమైందో కాని ఆభవనం ఇంత వరకు ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోలేదు. నూతన భవనాలను సైతం నిర్మించలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నర్సంపేటలోని ఐబీ కార్యాలయాలకు నిధులు మంజూరు చేసి కొత్త భవనాలు నిర్మించాలని అధికారులు, సిబ్బంది, పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

నర్సంపేటలోని ఐబీ కార్యాలయాన్ని నిజాం కాలంలో నిర్మించారు. వర్షాకాలం వచ్చిందంటే గదులు కురిసి ఫైళ్లు తడుస్తున్నాయి. దీంతో ఎప్పుడు కూలుతుందోనని భయంభయంగా విధులు నిర్వరిస్తున్నాం. నూతన భవనం కావాలని గతంలో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించాం. ఉన్న భవనంలోనే కాలం వెళ్లదీస్తున్నాం.

- రాంప్రసాద్, ఐబీ డీఈ, నర్సంపేట

విధుల్లో నిర్లక్ష్యం వద్దు : డీఆర్‌డీఓ



ప్రజావేదికలో రికార్డులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కౌసల్యాదేవి

వర్ధన్నపేట: విధుల్లో నిర్లక్ష్యం వద్దని డీఆర్‌డీఓ కౌసల్యాదేవి అన్నారు. ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శుల అలక్ష్యంతో గ్రామాల్లో నాటిన మొక్కలు ఎండిపోయయాని ఆమె అసహనం వ్యక్తం చేశారు. వర్ధన్నపేట ఎంపీడీఓ కార్యాలయలో జాతీయ ఉపాధి హామీ పనులపై శుక్రవారం 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇల్లంద, బండౌతపురం, కట్ర్యాల తదితర గ్రామాల్లో నాటిన మొక్కలు లేకుండా పోయాయని పేర్కొన్నారు. ఇందుకు సంబంధిత ఫీల్డ్‌అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు బాధ్యత వహించాల్సి ఉంటుందని, నిర్లక్ష్యం వహించిన వారికి సంజాయిషీ నోటీసులు అందజేస్తామని స్పష్టం చేశారు. రికార్డుల్లో నమోదై ఉన్న పనులు క్షేత్రస్థాయిలో లేకుంటే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించడంతోపాటు నిధులు దుర్వినియోగమైనట్లు తేలితే బాధ్యులను సహించేది లేదన్నారు. కొన్నిచోట్ల నిధులు దుర్వినియోగమైనట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఓ నాగేశ్వర్, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

- జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ రాంరెడ్డి



దుగ్గొండి: దోమల నివారణకు ఆయిల్‌బాల్స్ వేయిస్తున్న సీఈఓ రాంరెడ్డి

దుగ్గొండి: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు ఉంటాయని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ రాంరెడ్డి హెచ్చరించారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా నాచినపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. పోచమ్మ దేవాలయం ప్రాంతంలో సైడ్ కాల్వను పరిశీలించి వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. అరుణోదయ చేనేత సంఘం ఆవరణలోని నీటి గుంతల్లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయించారు. చేతిపంపు చుట్టూ అపరిశుభ్రంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టడంతోపాటు ప్రజలను చైతన్యం చేయాలని పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కు సూచించారు. ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టాలని పల్లె వైద్యశాల వైద్యుడు హుస్సేన్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ లెక్కల అరుంధతి, మండల పంచాయతీ అధికారి శ్రీధర్, ఏఎన్‌ఎంలు, పారిశుద్ధ్య కార్మికులు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలి

పర్వతగిరి: మురుగు నీరు నిల్వ ఉండకుడా గ్రామ పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జ్ డీపీఓ రాంరెడ్డి ఆదేశించారు. మండలంలోని నారాయణపురం గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఎంపీడీఓ ఎం.శంకర్‌నాయక్, ఎంపీఓ పాక శ్రీనివాస్, నాయబ్ తహసీల్దార్ హారతి తదితరులు పాల్గొన్నారు.

మనుగొండలో పర్యటన..

గీసుకొండ: మండలంలోని మనుగొండలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ కమలాకర్, ఎంపీఓ ఆడెపు ప్రభాకర్, ఏపీఓ చంద్రకాంత్, పంచాయతీ కార్యదర్శి షకీల్‌అహ్మద్, ఆశ కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



నర్సంపేట : షాపింగ్ కాంప్లెక్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట: రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు నర్సంపేటలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమి పూజ చేసి మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి నీరజ, ఆడిట్ ఆఫీసర్ మనోహర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ తోట శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ బొబ్బాల రమణారెడ్డి, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ లక్ష్మణ్‌నాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మేరుగు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోదాంలు ప్రారంభం

నర్సంపేట రూరల్: నర్సంపేట మండలంలోని కమ్మపల్లి, ఇటుకాలపల్లి గ్రామాల్లో నాబార్డ్, డీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్మించిన 300 మెట్రిక్ టన్నుల గోదాంలను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. జిల్లా సహకార అధికారి నీరజ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ తోట శ్రీనివాస్, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, టీ పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- భానోజీపేట పీహెచ్‌సీ తనిఖీ



భానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డు పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య శారద

నర్సంపేట రూరల్ : మలేరియా, డెంగీ, విష జ్వరాలు ప్రబలకుండా వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. నర్సంపేట మండలంలోని భానోజీపేట ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫీవర్ సర్వే, మందుల రికార్డులు పరిశీలించారు. మలేరియా, డెంగీ, విష జ్వరాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న వారికి తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలకు ఫీవర్ టెస్ట్ కిట్లు అందించామని వివరించారు. ఆశవర్కర్లు, ఏఎన్‌ఎంలు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో తిరగాలని కలెక్టర్ సూచించారు. మలేరియా, డెంగీ, విష జ్వరాలతో సీరియస్‌గా ఉంటే ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేయాలని చెప్పారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, సిబ్బందితోపాటు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. భానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నాగుర్లపల్లి గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. రోగులకు అందించిన మందులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం నర్సంపేట మండలంలోని మహేశ్వరం గ్రామ అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌ను కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడంతోపాటు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అరుణచంద్ర, రెసిడెన్షియల్ స్కూల్ ప్రత్యేకాధికారి ఇషాక్ అలీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఓపీఎస్‌ను పునరుద్ధరించాలి



కొండాపూర్‌లో నిరసన తెలుపుతున్న పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు

నల్లబెల్లి: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దు చేసి.. పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించిన తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ మండల బాధ్యుడు బైరబోయిన సుధాకర్ కోరారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో కొండాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం నిరసన తెలిపారు. జీఓ ఎంఎస్ 28 కరపత్రాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ గఫార్, మండల అధ్యక్షుడు నక్కిరెడ్డి మహేందర్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడు ధర్మేందర్, ప్రధాన కార్యదర్శి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

'జూడా'ల సమ్మె విరమణ.. నేటినుంచి విధుల్లోకి..



ఎంజీఎం : కోల్‌కతాలో యువ వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, కేంద్ర రక్షణ చట్టం, జూనియర్ డాక్టర్ల(జూడా)కు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ పది రోజులుగా జూనియర్ డాక్టర్లు ఎంజీఎం అవరణలో చేస్తున్న నిరసన ధర్నా, సమ్మెను సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం భరోసాతో శుక్రవారం విరమించారు. ఎంజీఎం ఆస్పత్రిలో జూడాలకు విశ్రాంతి గదులు, వాష్‌రూమ్‌లు, సెక్యూరిటీ కల్పిస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ మురళి హామీ ఇచ్చారు. ఈ మేరకు పనులు వేగవంతం చేసినట్లు తెలిపారు. శనివారం నుంచి జూడాలు ఓపీలు, ఎలెక్టివ్, ఎమర్జెన్సీ విధులకు హాజరవుతారని ప్రకటించారు. కాగా, బాధితురాలికి న్యాయం జరిగే వరకు విధుల అనంతరం నిరసనలు చేపడతామని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి



ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

గీసుకొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులోఆయన మాట్లాడారు. ప్రతీ పోలింగ్ బూత్‌లో 200 మందిని సభ్యులుగా చేర్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. సభ్యత్వ నమోదు కోసం 8800002024 టోల్ ఫ్రీ నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇవ్వాలని కోరారు. వచ్చే నెల నాలుగు నుంచి అక్టోబర్ 15 వరకు సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీకి 5 శాతం ఓట్లు తక్కువగా వచ్చాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్‌ఆర్, ఉత్తమ్, పొంగులేటి ట్యాక్స్‌లు వసూలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతు భరోసా నిధులు ఎప్పుడు విడుదల చేస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్, ధరణి, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోలు, గొర్రెల పంపిణీ కుంభకోణాల్లో ఇప్పటి వరకు ఏ ఒక్క బీఆర్ఎస్ ప్రజాప్రతినిధి, నాయకులను అరెస్టు చేయలేదని ఆరోపించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీశ్‌షా, నాయకులు, అరూరి రమేశ్, ఎడ్ల అశోక్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బాకం హరిశంకర్, రాణాప్రతాప్‌రెడ్డి, కంభంపాటి ప్రతాప్, గట్టికొప్పుల రాంబాబు, కంది క్రాంతికుమార్, గోదాసి అశ్వినికుమార్ పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం

- నేర సమీక్షలో సీపీ అంబర్ కిషోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: మహిళలు, చిన్నారుల భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులకు సూచించారు. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ముందుగా జోన్ల వారీగా కేసులు, వాటి ప్రస్తుత స్థితిగతులు, నిందితుల అరెస్టులో జాప్యం తదితర అంశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణకు ఉన్నతాధికారులు సైతం రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తూ కిందిస్థాయి సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని, ప్రధానంగా మహిళలు, పిల్లలపై నేరాలకు పాల్పడే వారిపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. వారికి తప్పకుండా శిక్షలు పడేవిధంగా అధికారులు నైపుణ్యంతో కూడిన దర్యాప్తు చేపట్టాలని సూచించారు. యువకులు తాత్కాలిక జల్సాల కోసం తప్పుడు మార్గాలను ఎంచుకుంటున్నారని, తద్వారా నేరాలకు పాల్పడుతున్నారని, స్టేషన్ అధికారులు స్టేషన్ పరిధిలో యువతకు దిశా నిర్దేశం చేసేందుకు చొరవ చూపాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా నిరంతరం పోలీస్ పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. ముఖ్యంగా నేరాల కట్టడి కోసం సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని, దీనికోసం ప్రజలను ప్రోత్సహించాల్సి ఉంటుందని వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చొరవ చూపడంతోపాటు, బ్లాక్ స్పాట్లలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సెంట్రల్, వెస్ట్‌జోన్ డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, అదనపు డీసీపీలు, రవి, సురేశ్‌కుమార్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆలయాల భూములకు రక్షణేది?

హన్మకొండ కల్చరల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో వందల ఏళ్లనాటి దేవాలయాల భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. అయినప్పటికీ దేవాదాయ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ నాయకుల అండదండలు, చట్టాల్లో లొసుగులు కబ్జాదారులకు వరంగా మారాయి. దేవాలయాల భూములు ఆక్రమిస్తే ఊరుకోమని దేవాదాయశాఖ అధికారులు అంటున్నారే తప్ప.. చర్యలు తీసుకోవడానికి మాత్రం సాహసించడం లేదు. కొన్ని చోట్ల దేవాలయ భూముల్లో అధికారులు బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు.

విచారణకు అధికారి గైర్హాజరు

ఈమేరకు నగరంలోని రంగసాయకస్వామి, పద్మాక్షి దేవాలయం, వీర పిచ్చమాంబ, వేణు గోపాలస్వామి దేవాలయాలకు సంబంధించిన 20.39 ఎకరాల అక్రమ కబ్జాలపై లోకాయుక్తలో 2022లో వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ సమితి కన్వీనర్ చీకటి రాజు దేవాలయాల భూమి అక్రమ కబ్జాపై లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. శుక్రవారం లోకాయుక్తలో విచారణ జరిగింది. ఈవిచారణకు పద్మాక్షి దేవాలయం, సిద్ధేశ్వరస్వామి దేవాలయ కార్యనిర్వహణాధికారులు మాత్రమే హాజరయ్యారు. వరంగల్ దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ హాజరు కాకపోవడంతో తదుపరి వాయిదా అక్టోబర్ 3న తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ తప్పనిసరిగా హాజరు కావాలని లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు ఆదేశించారు.

అర్చకుడిపై ఆరోపణలు.. విచారణ

మడికొండ: మడికొండ మెట్టు రామలింగేశ్వరస్వామి ఆలయ అర్చకుడు రాగిచేడు అభిలాష్‌శర్మపై వచ్చిన ఫిర్యాదులపై దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతారావు, అసిస్టెంట్ కమిషనర్ సునీత, ఇన్‌స్పెక్టర్ సంజీవరెడ్డి శుక్రవారం మెట్టుగుట్ట ఆలయ కార్యాలయంలో విచారణ చేపట్టారు. అర్చకుడు ఎవరి అనుమతి లేకుండా దాతలు ఇచ్చిన వెండి సామగ్రిని బయట షాపులో తూకం వేయించారని మాజీ చైర్మన్ దువ్వ నవీన్.. డీసీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అర్చకుడి వివరణ తీసుకుంటానని డిప్యూటీ కమిషనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మెట్టుగుట్ట శివాలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, ఆలయ కార్యనిర్వహణాధికారి శేషభారతి, భక్తులు చిగురుపాటి వెంకటేశ్వర్లు, కరుణాకర్‌రెడ్డి, పల్లపు అశోక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాహనం నుంచి పడిన తుపాకీ

- పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన ఆటోడ్రైవర్

వరంగల్ : భీమారంలోని సీఆర్పీఎఫ్ 58వ బెటాలియన్ నుంచి మణిపూర్‌కు వెళ్తున్న సైనికుల వాహనం నుంచి తుపాకీ (కార్బన్) పడిపోయింది. కాగా పైడిపల్లికి చెందిన ఆటో డ్రైవర్ ధరావత్ శ్రీను వరంగల్ వైపునకు ఆటోతో వెళ్తుండగా ఎంజీఎం జంక్షన్‌లో రోడ్డుపై తుపాకీ(కార్బన్) కనిపించింది. వెంటనే దానిని తీసుకొని మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌చార్జ్ హెడ్ కానిస్టేబుల్ ధర్మానాయక్‌కు అప్పగించాడు. కొద్ది నిమిషాల్లోనే తుపాకీ సిల్లింగ్ ఊడిపోయి వాహనం నుంచి జారిపడిన శబ్దం వచ్చిందని, ఆ ప్రాంతంలో పరిశీలిస్తే తుపాకీ కనిపించలేదని సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రాజేష్ కుమార్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశాడు. దీంతో అక్కడే ఉన్న తుపాకీని చూసి ఇది తనదే అని చెప్పాడు. దీంతో పోలీసులు అతని వివరాలు తీసుకుని తుపాకీ (కార్బన్) అతనిదేనని నిర్ధారించుకొని అప్పగించారు. ఈ విషయాన్ని వెంటనే ఉన్నత స్థాయి అధికారులకు తెలియజేసినట్లు మట్టెవాడ పోలీసులు పేర్కొన్నారు.

టెక్నాలజీతో పారదర్శకత

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : ఉద్యోగులు తమ విధుల నిర్వహణలో టెక్నాలజీ వినియోగంతో పారదర్శకత సాధ్యపడుతుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో ఎంపిక చేసిన వారికి నాలుగు వారాల కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంలో భాగంగా యూనివర్సిటీ కంప్యూటర్స్ విభాగంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంఎస్ ఎక్సెల్ వినియోగంతో లెక్కలు, పద్దులు, జీతాల బిల్లుల తయారీలో మెళకువలు నేర్చుకోవాలని మల్లారెడ్డి ఉద్యోగులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ రమ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడిపై కేసు



సీజ్ చేసిన మందులు చూపుతున్న అధికారులు

లింగాలఘణపురం : మండలంలోని నవాబుపేటకు చెందిన అలికట్టి కృష్ణ ఎలాంటి అర్హత లేకుండా క్లినిక్ నిర్వహిస్తున్నాడు. అంతేకాకుండా అనుమతి లేని అల్లోపతి మందులను విక్రయించేందుకు నిల్వ చేయడంతో కేసు నమోదైంది. శుక్రవారం ఔషధ నియంత్రణ శాఖ సంచాలకులు డాక్టర్ రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో జనగామ, వరంగల్ జిల్లా ఔషధ తనిఖీ అధికారులు బాలకృష్ణ, అరవింద్ ఆధ్వర్యంలో సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో సుమారు రూ.25వేల విలువైన మందులను సీజ్ చేసి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో సమర్పించారు.

రూ.200కోట్లు పైనే..

పేరుకుపోయిన లైబ్రరీ పన్ను

- చెల్లించాలని కార్పొరేషన్‌కు గ్రంథాలయ సంస్థ ప్రతిపాదనలు
- ఏళ్ల తరబడి భర్తీకాని ఖాళీలు

హన్మకొండ చౌరస్తా : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు.. అందుకే చినిగిన చొక్కా అయినా వేసుకో మంచి పుస్తకం కొనుక్కో అని మహనీయులు బోధించారు.మారుతున్న కాలానికి అనుగుణంగా, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని గ్రంథాలయాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. కానీ పదేళ్లలో కేంద్ర ప్రభుత్వ నిధులతో వరంగల్ సెంట్రల్ లైబ్రరీ, హనుమకొండ జిల్లా గ్రంథాలయాలు మాత్రమే వసతుల కల్పనకు నోచుకున్నాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రధానమైన వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలోని 90 శాతానికి పైగా గ్రంథాలయాలు అరకొర వసతులు, సిబ్బంది లేమితో నెట్టుకొస్తున్నాయి. పదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయ శాఖలోని ఖాళీ ఉద్యోగాలను భర్తీ, వసతుల కల్పన కోసం తీసుకున్న చర్యలు శూన్యం.



హనుమకొండ జిల్లా కేంద్ర గ్రంథాలయం

సెస్ అంటే..

గ్రంథాలయాల నిర్వహణకు నిధుల సేకరణ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించారు. అందుకోసం గ్రంథాలయాలను స్థానిక సంస్థల పరిధిలో చేర్చుతూ అప్పటి ప్రభుత్వం 1960 లో ఓ చట్టాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రంలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్లకు ప్రజలు చెల్లిస్తున్న వివిధ పన్నులలో 8 శాతం గ్రంథాలయాలకు కేటాయించాలని చట్టం చెబుతోంది. పంచాయతీ, మున్సిపల్, కార్పొరేషన్‌ల నుంచి వచ్చే 8 శాతం నిధులతో గ్రంథాలయాల నిర్వహణ, వసతుల కల్పన, ఉద్యోగాల భర్తీ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలను చేసుకునేలా చట్టాన్ని రూపొందించారు.

ఖాళీలు ఇలా..

గ్రేడ్–2 లైబ్రేరియన్‌లు ముగ్గురికి గానూ హనుమకొండ, పరకాల లైబ్రరీలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆత్మకూర్, శాయంపేట, వంగర, ఎల్కతుర్తి, కమలాపూర్, భీమదేవరపల్లి శాఖ గ్రంథాలయాల్లో గ్రేడ్–3 లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హనుమకొండ జిల్లా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ పోస్టులు(2) ఖాళీగా ఉన్నాయి. అటెండర్లు హనుమకొండ, హసన్‌పర్తి, పరకాల, ఆత్మకూర్‌లో (6) అటెండర్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. పబ్లిక్‌గార్డెన్‌లో బాలల గ్రంథాలయం, పరకాలకు వాచ్‌మన్ (2) పోస్టులు, హనుమకొండ గ్రంథాలయంలో (2) బుక్‌బైండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వరంగల్‌లో ఖాళీలు..

నర్సంపేటలో గ్రేడ్–2 లైబ్రేరియన్ (1), పర్వతగిరి, రాయపర్తి, ఖానాపూర్, సంగెం, నల్లబెల్లి, చెన్నారావుపేట, దుగ్గొండి, నెక్కొండ, గీసుకొండ, వర్ధన్నపేట శాఖ గ్రంథాలయాలకు గ్రేడ్–3 లైబ్రేరియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వరంగల్, పర్వతగిరి, వర్ధన్నపేట లైబ్రరీలో–3 అటెండర్ పోస్టులు, రాయపర్తి, నర్సంపేటలో–2 వాచ్‌మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పదేళ్లలో చెల్లించాల్సిన సెస్ రూ.200 కోట్లు పైనే..

వరంగల్, హనుమకొండ జిల్లా గ్రంథాలయాలకు సెస్ నిధులను గడిచిన పదేళ్లలో ఒక్క రూపాయి చెల్లించలేదు. అనధికారిక లెక్కల ప్రకారం 2014 నుంచి 2024 వరకు హనుమకొండ, వరంగల్ జిల్లాలకు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రావాల్సిన సెస్ దాదాపు రూ.200ల కోట్లకు పైనే ఉంటాయని గ్రంథాలయ సంస్థ తెలియజేస్తుంది. అధికారికంగా లెక్కలు తీస్తే రూ.400ల కోట్ల వరకు చెల్లించాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

సాంకేతిక లోపంతో చెల్లింపులు లేవు?

మున్సిపల్ కార్పొరేషన్ ప్రతి ఏటా రూపొందించే డిమాండ్ కలెక్షన్ బ్యాలెన్స్ ప్రకారం చెల్లింపులు జరుగుతున్న పన్నులలో చట్ట ప్రకారం గ్రంథాలయ సంస్థకు రావాల్సిన 8 శాతం వాటాను అంచనా వేస్తుంటారు. గ్రంథాలయ సంస్థ అంచనా ప్రకారం గత పదేళ్లలో రావాల్సిన వాటా రూ.200ల కోట్లకు పైగా ఉంటుందని చెబుతున్నారు. గ్రంథాలయాలకు సెస్ చెల్లింపుల కోసం తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.అయితే సాంకేతిక కారణాల వల్ల సెస్ చెల్లింపులో జాప్యం జరుగుతుందని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. లైబ్రరీ యాక్ట్–1960 ప్రకారం చెల్లించాల్సిన 8శాతం సెస్‌లో గత పదేళ్లుగా బకాయి ఉన్నట్లు గ్రంథాలయ సంస్థ అధికారులు చెబుతున్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తా..



యువతకు మార్గదర్శకంగా తీర్చిదిద్దాల్సిన గ్రంథాలయాలను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. పదేళ్లు గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఇటీవల సమావేశం నిర్వహించాం. రాష్ట్రవ్యాప్తంగా గ్రంథాలయాల దుస్థితి, అభివృద్ధి, సెస్ ఇతర సమస్యలను త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తా. పటిష్టమైన ప్రణాళికతో గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తాం.

– మహ్మద్ రియాజ్, చైర్మన్ తెలంగాణ గ్రంథాలయ పరిషత్

బకాయి అంచనా పంపించాం..



మున్సిపల్ కార్పొరేషన్ డిమాండ్ కలెక్షన్ బ్యాలెన్స్ ప్రకారం లైబ్రరీకి రావాల్సిన 8 శాతం సెస్ అంచనా వేసి ప్రతిపాదనలను కార్పొరేషన్‌కు అందజేశాం. అంచనా ప్రకారం రూ.200ల కోట్లకు పైనే రావాల్సి ఉంది. పదేళ్లకు చెల్లించాల్సిన మొత్తాన్ని గ్రంథాలయానికి అందజేస్తే జిల్లాలోని ఆయా గ్రంథాలయాల్లో ఖాళీలను భర్తీ చేసి, నిర్వహణ భారం ప్రభుత్వంపై పడకుండా ఉంటుంది.

– శశిజాదేవి, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, హనుమకొండ

వరంగల్ మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

వరంగల్ : ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా మూడు రోజులు సెలవుల కారణంగా బంద్ ఉంటుందని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. 24న శనివారం(వారంతపు యార్డు బంద్), 25న ఆదివారం(వారంతపు సెలవు), 26న సోమవారం(శ్రీకృష్ణజన్మాష్టమి) ఉన్నందున శనివారం నుంచి సోమవారం వరకు మార్కెట్ బంద్ ఉంటుందని తెలిపారు. 27వ తేదీ మంగళవారం మార్కెట్ పునఃప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఈవిషయాన్ని రైతులు, వ్యాపారస్తులు, గుమాస్తా, దడువాయి, కార్మికులు గమనించాలని కోరారు.

నిట్‌లో నేషనల్ స్పేస్ డే



స్పేస్ డే వేడుకలో ఇస్రో సైంటిస్ట్ వీఎం.చౌదరి

కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో శుక్రవారం నేషనల్ స్పేస్ డేను ఘనంగా నిర్వహించారు. నేషనల్ స్పేస్ డే వేడుకలకు ముఖ్య అతిథిగా నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్సీ) ఇస్రో సైంటిస్ట్ డాక్టర్ వీఎం.చౌదరి హాజరై నగరంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే పరిశోధనలపై ఆసక్తిని పెంపొందించుకుని సైంటిస్టులుగా రాణించాలని, స్పేస్ పై పరిశోధనలను చేపట్టేందుకు సిద్ధం కావాలని సూచించారు. ఆహార భద్రత కోసం స్పేస్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత ట్రెండ్ చంద్రుడి అన్వేషణలో కొనసాగుతుందని ఇందుకు విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకుని ముందుకు సాగాలని స్కైరూట్ ఏరోస్పేస్ ఇస్రో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సీపీఎస్.కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ, ప్రొఫెసర్లు శిరీష్ సోనావానే, ఆంజనేయులు, హరినాథ్, సంపత్ కుమార్, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కొడుకు మృతి

తట్టుకోలేక పినతల్లి హఠాన్మరణం

- తండ్రికి తలకొరివి పెట్టిన ఐదేళ్ల కుమారుడు
- మహబూబాబాద్ పరిధిలోని శనిగపురంలో విషాదం



మంద రవి(ఫైల్)



మంద జ్యోతి(ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : అనారోగ్యంతో పాటు మనోవేదనకు గురైన కొడుకు చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతడిని చూసేందుకు వచ్చిన పినతల్లి గుండెపోటుతో తుదిశ్వాస విడిచింది. ఏం జరుగుతుందో తెలియని ఐదేళ్ల చిన్నారి కన్నతండ్రికి తలకొరివిపెట్టిన విషాదకర సంఘటన శుక్రవారం శనిగపురంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామానికి చెందిన మంద వెంకన్న రైల్వేలో ట్రాక్‌మన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు భార్య స్వరూప, ఇద్దరు కుమారులు మంద రవి(32), వంశీ, కుమార్తె ఉన్నారు. భార్య స్వరూప ఇరవై ఏళ్ల క్రితం మృతిచెందగా వెంకన్న చిన్నగూడురు మండలం జయ్యారం గ్రామానికి చెందిన జ్యోతిని రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు కూతురు సంగీత, కుమారుడు సాయి ఉన్నారు. అయితే వెంకన్న అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతిచెందగా కొద్ది రోజుల తర్వాత జ్యోతి తన కుమారుడు, కుమార్తెతో ఖమ్మంలోని అగ్రహారం కాలనీలో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో కుమారుడు సాయి రైల్వే ఉద్యోగంలో చేరగా, రవి ఆటో నడుపుతూ భార్య స్వప్న, ఐదేళ్ల కుమారుడు నవనీత్‌తో ఉంటున్నాడు. మారుతల్లి (పినతల్లి) ఖమ్మంకు వెళ్లిన కొంతకాలం నుంచి వారి మధ్య కుటుంబ, ఆస్తి, ఉద్యోగం విషయంలో తగాదా నేపథ్యంలో కోర్టులో కేసు నమోదైంది. అలాగే ఏడాది క్రితం రవి భార్య స్వప్న తన తల్లిగారింటికి వెళ్లిపోగా అన్ని రకాల సమస్యలతో మనోవేదనకు గురై రవి కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. రవి మృతి సమాచారాన్ని పెంచిన తల్లి జ్యోతికి తెలియజేయగా ఆమె శుక్రవారం ఉదయం శనిగపురం గ్రామానికి వచ్చి అతడి మృతదేహాన్ని చూసి రోదిస్తూ తట్టుకోలేక అక్కడే కుప్పకూలి పడిపోయింది. వెంటనే స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆమె గుండెపోటుతో మృతిచెందిదని తెలిపారు.



కుండపట్టి తండ్రికి తలకొరివి పెట్టేందుకు వెళ్తున్న కుమారుడు నవనీత్

శనిగపురం గ్రామంలో విషాదఛాయలు..

మంద రవిని చూసేందుకు వచ్చి మారుతల్లి (పినతల్లి) జ్యోతి హఠాన్మరణం చెందగా శనిగపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తండ్రి రవికి ఐదేళ్ల కుమారుడు నవనీత్ తలకొరివి పెట్టడంతో గ్రామస్తులు కంటతడి పెట్టుకున్నారు. ఇంత చిన్నవయసులో ఎంత కష్టం వచ్చింది బిడ్డా..అని కన్నీటి పర్యంతమయ్యారు.

‘ఓపెన్’గా చదివేద్దాం..

- అంబేడ్కర్ వర్సిటీలో నాణ్యమైన విద్య
- డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందాలి
- యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు

కేయూ క్యాంపస్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ(యూజీ) బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లోను, పీజీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, బీఎల్ఐఎస్సీ, ఎంఎల్ఐఎస్సీ తదితర డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 31వ తేదీలోగా ఆసక్తిగల అభ్యర్థులు ప్రవేశాలు పొందాలని హైదరాబాద్‌లోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలోని అంబేడ్కర్ యూనివర్సిటీ వరంగల్ ప్రాంతీయ అధ్యయన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రీజినల్ కోఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు కారణాలతో రెగ్యులర్ విద్యను నిలిపి వేసిన విద్యార్థులు కూడా ఓపెన్ యూనివర్సిటీలో చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. డిగ్రీ కోర్సులు సెమిస్టర్ సిస్టంలోను, పీజీ కోర్సులు ఇయర్‌వైజ్ స్కీంలో నిర్వహిస్తున్నామన్నారు. కాంటాక్ట్ తరగతులతో పాటు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నామన్నారు. వివిధ వృత్తిలో పనిచేస్తూ కూడా ఓపెన్ వర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సులను పూర్తిచేసుకునే అవకాశం ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రంలోని స్టడీ సెంటర్లలో ప్రవేశాలు పొందేందుకుగాను విద్యార్హతలు, ఫీజులు, కోర్సుల వివరాలను ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూఆన్‌లైన్.ఇన్ లేదా డబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏఓయూ.ఏసీ.ఇన్‌లో పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ తెలుగు విభాగం అధిపతి ప్రొఫెసర్ రజని, ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబు, డాక్టర్ ఆదిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, పక్కన ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు

ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ఫీజు చెల్లించాలి

ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈనెల 31వ తేదీలోపు ట్యూషన్ ఫీజు చెల్లించాలని వర్సిటీ జేడీ ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం, సందేహాలుంటే సమీపంలోని అధ్యయన కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. డిగ్రీ, పీజీ పూర్వవిద్యార్థులు రెండో, మూడో సంవత్సరంలో సకాలంలో ఫీజులు చెల్లించలేకపోయిన వారు 2015–16నుంచి 2023–24వరకు అడ్మిషన్లు పొంది ఉంటే వారు కూడా ఫీజులు చెల్లించేందుకు ఈనెల 31వరకు గడువు ఉందని తెలిపారు.

పరీక్ష కేంద్రం తనిఖీ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పీజీ కోర్సుల పరీక్షలు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నారు. కాగా పరీక్ష కేంద్రాన్ని యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లుతో పాటు ప్రొఫెసర్ రజని తనిఖీ చేశారు.

1న జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ : సెప్టెంబర్ 1వ తేదీన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్–5 నుంచి అండర్–18 బాల బాలికల రోలార్ స్కేటింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వరంగల్ స్కేటింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బండి సిద్దార్థ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాంపూర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆవరణలో నిర్వహించే ఎంపికలలో పాల్గొనే క్రీడాకారులు తమ పేర్ల ను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాలకు 63015 91754, 83318 14164 నంబర్‌లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే ఆరోపణలు

- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ
- కొనసాగుతున్న రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు

సాక్షిప్రతినిధి, వరంగల్ / న్యూశాయంపేట : తెలంగాణలో ప్రజా సమస్యల నుంచి దృష్టిని మరల్చేందుకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపులపై పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ అన్నారు. హనుమకొండలో జరుగుతున్న సీపీఐ తెలంగాణ రాష్ట్ర సమితి నిర్మాణ సమావేశాల సందర్భంగా శుక్రవారం కాకతీయ హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులతో కలిసి నారాయణ మాట్లాడారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనమవుతుందని సీఎం రేవంత్ రెడ్డి చెబుతుండగా, రేవంత్ రెడ్డే బీజేపీలో చేరుతారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని ఉదహరించారు. ఆయా పార్టీలు కలిసి రాజకీయ క్రీడ ఆడుతున్నాయని ఎద్దేవా చేశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సీపీఐ స్వాగతిస్తోందని, అయితే వర్గీకరణకు, క్రిమిలేయర్ సంబంధం లేదని, కోర్టులో విచారణ సందర్భంగా తాము ఈ విషయాన్ని తెలియజేస్తామన్నారు. మాజీ ఎంపీ అజీజ్‌పాషా మాట్లాడుతూ.. బడ్జెట్‌లో వైద్య రంగానికి కేవలం 1.35 శాతం ఖర్చు చేయడం సిగ్గుచేటని, ఇది వైద్య రంగంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోందని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాలు శనివారంతో ముగుస్తాయని తెలిపారు. ముగింపు సమావేశాల్లో కీలక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని, వాటిని ప్రకటిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాస్, పశ్యపద్మ, కలవేణ శంకర్, ఎం.బాలనరసింహ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.విజయ సారథి, మర్రి వెంకటస్వామి, హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పాల్గొన్నారు.



రాజాకు చెక్కు అందజేస్తున్న నాయకులు

వయనాడ్ బాధితులకు సీపీఐ విరాళం

వయనాడ్ బాధితుల కోసం సీపీఐ రాష్ట్ర తెలంగాణ సమితి రూ.5.41లక్షల ఆర్థికసాయాన్ని అందించింది. ఈ మేరకు హనుమకొండలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా శుక్రవారం సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు రాష్ట్ర సమితి తరఫున పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చెక్కును అందజేశారు.

డెంగీతో యువకుడి మృతి



కాలేష్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ : ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన కడమంచి కాలేష్(31) డెంగీతో బాధపడుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. దినసరి కూలీ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కాలేష్‌కు భార్య, నెలరోజుల వయస్సు ఉన్న ఇద్దరు కవల ఆడపిల్లలు ఉన్నారు. కాగా జ్వరంతో బాధపడుతున్న కాలేష్ ఐదు రోజుల క్రితం స్థానికంగా వైద్యం చేయించుకున్నాడు. అయినా జ్వరం తగ్గకపోవడంతో రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్క డి వైద్యులు డెంగీ జ్వరంగా నిర్ధారించి చికిత్స అందించారు. అయితే రక్తకణాలు తగ్గడంతో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. కాలేష్ డెంగీతో మృతి చెందడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య సమస్య, దోమల నివారణకు పంచాయతీ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విషజ్వరంతో బాలిక..



నిత్యశ్రీ (ఫైల్)

గీసుకొండ : మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన దూల మహేందర్–శ్రీలత దంపతుల కూతురు నిత్యశ్రీ (9) విషజ్వరంతో మృతి చెందింది. రెండ్రోజుల క్రితం నిత్యశ్రీకి తీవ్ర జ్వరం రాగా తల్లిదండ్రులు ఆమెను ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.అయితే గురువారం రాత్రి వాంతులు, విరేచనాలు కావడంతో వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందిందని తెలిపారు. అయితే బాలికకు ఫిట్స్ రావడంతో బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెంది ఉంటుందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రెండు కార్లు ఢీ.. ఒకరి మృతి

శాయంపేట : ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి కాలు విరిగింది. మిగిలిన వారికి స్వల్ప గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం కొత్తగట్టు సింగారం శివారులో చోటు చేసుకుంది. ఎస్సై ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం.. వరంగల్‌లోని నాయుడు పెట్రోల్ పంపు ప్రాంతానికి చెందిన జన్ను ఎల్లయ్య, నాగమ్మ, నరేందర్, సబితారాణి పరకాలలో తమ బంధువుల వివాహానికి హాజరై కారులో తిరిగి ఇంటికి వెళ్తున్నారు.అదే విధంగా భూపాలపల్లి చెందిన సిలువేరి శివకుమార్, ఉదయ్‌కుమార్, మమత, పద్మావతి, అద్వికిరాయ్ వరంగల్ నుంచి భూపాలపల్లికి కారులో వెళ్తున్నారు. పరకాల–హనుమకొండ ప్రధాన రహదారిలోని కొత్తగట్టు సింగారం శివారులో వీరు ప్రయాణిస్తున్న కార్లు ఎదురెదురుగా అతివేగంతో వచ్చి ఢీకొనడంతో జన్ను మల్లయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మల్లయ్య మృతి చెందాడు. మరో కారులో ప్రయాణిస్తున్న సిలువేరి పద్మావతి కాలు విరగగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.



ఘటనా స్థలిలో నుజ్జునుజ్జయిన కార్లు

రెప్పపాటులో తప్పిన ప్రమాదం

- ప్రయాణికుడిని కాపాడిన రైల్వే పోలీస్

కాశిబుగ్గ : వరంగల్ రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి కదులుతున్న రైలులో ఫుట్‌బోర్డ్‌పై వేళాడుతూ పడిపోతున్న ఓ ప్రయాణికుడుని ఆర్పీఎఫ్ పోలీసులు కాపాడారు. ఆర్పీఎఫ్ ఎస్సై జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా బిట్వాడ మండలం వీరగట్టుకు చెందిన అట్టాడ అన్నమనాయుడు వరంగల్ నుంచి చీపురుపల్లి వెళ్తున్నాడు. అయితే రైలు కదులుతుండగా అన్నమనాయుడు బ్యాగుతో పాటు రైలెక్కి ఫుట్‌బోర్డుపై వేళాడుతూ కింద పడిపోతుండగా ప్లాట్‌ఫాం–1లో విధులు నిర్వహిస్తున్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మోహన్ గమనించి పరుగెత్తి ప్రయాణికుడిని చాకచక్యంగా బయటకు లాగాడు. రెప్పపాటులో ప్రయాణికుడు రైలు కింద పడిపోయేవాడని, కానిస్టేబుల్ మోహన్ కాపాడడంతో ఆర్పీఎఫ్ ఉన్నతాధికారులు, ప్రయాణికులు అభినందించారు. అనంతరం ప్రయాణికుడిని స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చి మరో రైలులో పంపించామని ఎస్సై తెలిపారు.



ప్రయాణికుడిని కాపాడుతున్న పోలీస్ (సీసీ ఫుటేజీ)